ఇచ్చిన మాట తప్పని సీఎం వైఎస్ జగన్

నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్



నూజివీడు సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: దేశంలో మాట ఇస్తే తప్పక నెరవేర్చే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి సీఎంను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ వదులుకోకూడదని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలను పట్టణంలోని పీజీ సెంటర్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో ఉన్న వైఎస్ జగన్‌ను ఓడించడం చంద్రబాబుకు మరో జన్మలో కూడా సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలిచిన ప్రభుత్వం తమదన్నారు. పట్టణంలో రూ.25 కోట్లతో ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం జరుగుతోందని, ఇది పూర్తయిన వెంటనే వంద పడకల ఆస్పత్రిని మూడు వందల పడకలకు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నూజివీడు వచ్చిన సందర్భంగా పట్టణంలో డ్రెయిన్ల అభివృద్ధికి రూ.16 కోట్లను మంజూరు చేశారన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా మూడుసార్లు నూజివీడు వచ్చి మూడు మొక్కలు నాటి వెళ్లారే తప్పితే చేసింది శూన్యమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, దీనికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు.

చంద్రబాబువన్నీ బూటకపు హామీలు

చంద్రబాబు ఇచ్చేవన్నీ బూటకపు హామీలేనని, వాటిని ప్రజలెవరూ విశ్వసించడం లేదని ఎమ్మెల్యే ప్రతాప్ అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చి ఇచ్చిన 650 హామీల్లో మూడు కూడా అమలు చేయని ఆయన్ను ఈ సారి కూడా తిరస్కరించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నూజివీడు ప్రాంతంలో రాజధాని అని చెప్పి తుళ్లూరు ప్రాంతానికి తీసుకెళ్లి ఈ ప్రాంతానికి ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము ప్రసంగించారు. మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా చరణ్, మేకల అనిల్, గాదెరెడ్డి రంజిత్ రెడ్డి, కోటగిరి పూర్ణిమ, కళ్లేపల్లి ఆదినారాయణ, పామర్తి రాధాకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ పింఛన్ కానుకను మండల కార్యాలయం వద్ద గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న పాల్గొని 4,931 మంది లబ్ధిదారులకు రూ.1,46,60,000 చెక్కు ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు బండి నాగమణి, బాణావత్ నాగబాలమ్మ, భట్రాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: మండలంలోని పైడూరుపాడు గ్రామంలో గురువారం పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. పైడూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి, కొత్తూరుతాడేపల్లి, జక్కంపూడి గ్రామాల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచి వేముల సీతారామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.3 వేలకు పెంచి ఇస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రూ.3 వేల పెన్షన్ ఇవ్వడంలేదన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ బి.భార్గవి, ఎంపీటీసీ సభ్యురాలు బయ్యారపు కల్పన, సొసైటీ మాజీ చైర్మన్ రంగినేని సాంబశివరావు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చెక్కు ఆవిష్కరించిన డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి, ఎంపీపీ జోత్స్న తదితరులు



పైడూరుపాడు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విస్సన్నపేట: అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక ఏఎంసీ గోడౌన్ వద్ద రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పింఛను కానుకను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలో 8,431 మందికి రూ.2,50,26,000 అందజేశారు. కొత్తగా 117 మందికి జనవరి నుంచి పింఛన్లు మంజూరుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ నాయకులు అనుమోలు శివాజీ, సిరసాని ప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు చాట్ల మణి, మేడా తిరుపతిరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జి.రమేష్ బాబు, పి.విజయకుమారి, పి.వెంకటేశ్వరరావు, బాలకొండయ్య, దారావతు బోడి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం సీజ్



తునికిపాడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గంపలగూడెం: మండలంలోని తునికిపాడులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాన్ని సీజ్ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ కిషోర్‌బాబు, ఏడీ ఎ.కల్యాణ్ కుమార్, వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ గ్రామంలో మరీదు నాగేశ్వరరావుకు చెందిన శ్రీ కృష్ణాంజనేయ ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేయగా పలు లోపాలు వెల్లడయ్యాయి. దుకాణం లైసెన్స్‌ను సక్రమంగా రెన్యూవల్ చేయక పోవడం, రికార్డులు, స్టాకు రిపోర్టు, బిల్లులు సరిగా లేకపోవడంతోపాటు బయో ఫెర్టిలైజర్స్ విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దుకాణాన్ని సీజ్ చేసి, రూ.12 లక్షల విలువైన ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. కొంత సరుకును స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి అప్పగించారు. మిగిలిన స్టాకును దుకాణంలో ఉంచి సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డును ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం: మండలంలోని కొత్తరెడ్డిగూడెం నుంచి కూనపరాజుపర్వ వరకు నిర్మించిన బ్లాక్ టాప్ (బీటీ) రహదారిని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)తో కలిసి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గురువారం ప్రారంభించారు. రూ.2.95 కోట్లతో ఈ రోడ్డును నిర్మించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో ఐదు కిలో మీటర్ల పొడవున నిర్మించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. కొత్తరెడ్డిగూడెం నుంచి కూనపరాజుపర్వ మార్గమధ్యలో రెండు వంతెనల నిర్మాణానికి ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం మండల జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, రెడ్డిగూడెం మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి, నాయకులు బొలగాని తిరుపతిరావు, చాట్ల రాబర్టు, రెడ్డిగూడెం, కూనపరాజుపర్వ సర్పంచులు మల్లాది రాణీ, మాతంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈఓ

చాట్రాయి: మండలంలో గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మర్లపాలెం, చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు జరిగాయి. మర్లపాలెం జెడ్పీ హైస్కూల్లో నూజివీడు డీవైఈఓ సేవ్యా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలను సమర్థంగా నిర్వహించాలి

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడదాం ఆంధ్రాలో భాగంగా ఈ నెల పదో తేదీన గంపలగూడెంలో జరిగే మండల స్థాయి పోటీలను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో మండల స్థాయి పోటీలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఎంపిక చేసిన టీములు మండల స్థాయి పోటీల్లో పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న మారెమ్మ హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో వేంచేసిన మారెమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం పది గంటలకు లెక్కిస్తామని ఆలయ ఈఓ సీతారామయ్య గురువారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, పోలీసు, రెవెన్యూ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని వివరించారు. అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసికునే లైసెన్సు హక్కుకు ఈ నెల తొమ్మిదో తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.


180 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): సీజనల్‌గా పశువుల్లో సంక్రమించే గాలికుంటు వ్యాధి నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాక్సిన్లు వేశారు. ఉమ్మడదేవరపల్లిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 150 గేదెలు, 30 ఆవులకు టీకాలు వేసినట్లు పశువైద్యులు శిరీష, అభిలాష్ తెలిపారు. మండలంలోని నెమలిలో శుక్రవారం పశువులకు వ్యాక్సిన్ వేస్తామని పేర్కొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గుంటుపల్లి గ్రామంలో పశువుల్లో అంటువ్యాధుల నివారణకు గురువారం టీకాలు వేశారు. సీజనల్‌గా వ్యాపించే ఫుట్, మౌత్ డిసీజ్ (ఎఫ్ఎండీ) నివారణకు టీకాల వేసే కార్యక్రమం చేపట్టామని లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ తెలిపారు. ఎఫ్ఎండీ వ్యాధి ఎక్కువగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్లో సీజనల్‌గా వస్తుందన్నారు. నోరు ఎర్రబారడం, సొంగ కారడం, కాళ్ల గిట్టల్లో మార్పులు చోటుచేసుకోవడం వ్యాధి లక్షణాలని వివరించారు. పశువుల్లో ఈ లక్షణాలు ఉంటే పశు వైద్యశాలలో సంప్రదించి టీకాలు వేయించాలని సూచించారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఎల్బీఆర్‌సీఈ)లో కంప్యూటర్ సైన్స్ (ఏఐ అండ్ ఎంఎల్) ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న బి.రాజేంద్రప్రసాద్ పీహెచ్‌డీ అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ.. రాజేంద్రప్రసాద్ విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ పరిశోధన ఎరిత్రోప్లాస్టీ సర్జరీలో మెషిన్ లెర్నింగ్ ఎలా సహాయ పడుతుందో విశదీకరించారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. జయప్రద తదితరులు రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



తోటపల్లిలోని హిల్ స్కూల్‌లో డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హిల్ స్కూల్ ఆవరణలో అంధుల అక్షర ప్రదాత డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హిల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు బి.సాయిబాబు మాట్లాడుతూ.. స్పర్శతో అక్షరాలను గుర్తించే విధానాన్ని కనిపెట్టడం ద్వారా అంధులు కూడా సకల విద్యలను అభ్యసించేందుకు దారి చూపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. హిల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో 33 మంది వివిధ కోర్సులు నేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. హిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, హిల్ అంధ పాఠశాల ఇన్‌చార్జి కె.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



మునునూరు: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ సూచించారు. రమణక్కపేట హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆంగ్ల, గణిత సబ్జెక్టుల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం చెకుముకి టాలెంట్‌లో మండల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినులు నాగ స్పందన, దివ్యశ్రీ, నేహప్రణీతను అభినందించారు.

యువత క్రీడల్లో రాణించాలి



ఆగిరిపల్లి: యువతీ యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాణించాలని కల్లుటూరు సర్పంచ్ రాఘవరపు సురేష్‌బాబు సూచించారు. చొప్పరమెట్ల, కల్లుటూరులో గురువారం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ రావు, చొప్పరమెట్ల సర్పంచ్ కూరాకుల ఊర్మిళ, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయోధ్య రామమందిర అక్షింతలతో గ్రామోత్సవం



తిరువూరురూరల్: అయోధ్య రామమందిర ట్రస్టు నుంచి తెచ్చిన అక్షింతలతో తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామోత్సవం జరిపారు. అక్షింతలను భక్తులు తలపై ఉంచుకుని ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. అక్కపాలెం రామాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. వామకుంట్లలోనూ అక్షింతలను ఊరేగించారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ

గంపలగూడెం: అయోధ్య రాముని పూజిత అక్షింతలు రామభక్తులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో గురువారం పంపిణీ చేశారు. అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ట చేయనున్న నేపథ్యంలో శ్రీరాముని ట్రస్ట్ పిలుపు మేరకు అక్షింతల పంపిణీ చేపట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆయా గ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో వృద్ధి పరిచారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు.

పాల ఉత్పత్తుల తనిఖీ



తిరువూరు: కృష్ణా మిల్క్ యూనియన్ సరఫరా చేసే పాల ఉత్పత్తులను లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి తిరువూరులోని పలు దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. నిర్ణీత గడువు దాటిన తదుపరి పాల ఉత్పత్తులను విక్రయించొద్దని, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడమే తమ సంస్థ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రైవేటు డెయిరీల పాలలో కల్తీ, నాణ్యతా లోపాల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సేల్స్ మేనేజరు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఇబ్రహీంపట్నం: ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పిన్నింటి మహేష్‌ను ఇబ్రహీంపట్నం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు విజయవాడలోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.సి.హెచ్.మోహన్, జిల్లా కార్యదర్శి సీహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు: కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.రాణి కోరారు. చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల గ్రామాల్లో నోడల్ అధికారి బి.శివ ఆధ్వర్యాన ఎంపీడీఓ, సర్పంచ్ కండెపు రామగిరి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మధుమోహన్ తమ శాఖ ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారిణి షకీనా ఇవాంజిలిన్ తమ శాఖ ద్వారా అందుతున్న వైద్య సేవలతోపాటు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వర రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇస్సాకు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం కుంటం బాబు, ఏపీఓ రోజ్‌లీల పాల్గొన్నారు.

గుండెపోటుతో తహసీల్దార్ మృతి



చాట్రాయి: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిట్టిపోతుల విశ్వనాథరావు (54)గురువారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండున్నరేళ్లుగా ఆయన ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విశ్వనాథరావు మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఎ.కొండూరు మండలం కంభంపాడుకు తరలించారు. శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విశ్వనాథరావు మృతదేహం వద్ద ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీడీఓ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది నివాళులర్పించారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ముసునూరు: మామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులను చేపట్టడం ద్వారా పంటను రక్షించుకుని, అధిక దిగుబడి సాధించొచ్చని ఉద్యాన శాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొర్లగుంట, తాళ్లవల్లి మామిడి తోటల్లో పంటను ఆమె పరిశీలించారు. జనవరిలో మామిడి తోటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. బోరాన్ లోపం, బూడిద తెగులు నివారణ చర్యలను వివరించారు. వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ ఎస్.సత్యనారాయణ, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

చౌటపల్లి(తిరువూరురూరల్): మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఉషారాణి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. కుష్ఠు రోగులు గుర్తింపు సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి ప్రజారోగ్య కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాభవాని, డెప్యూటీ పారా మెడికల్ అధికారి ప్రతాప్‌కుమార్, ఫిజియోథెరపిస్టు నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మైలవరం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని దాత కోడి రెక్కల ప్రసాద్ ఆకాంక్షించారు. మైలవరం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రసాద్ సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. వెల్వడం, చంద్రాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెల్వడం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.వి.సుధారాణి సహకారంతో, పొందుగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరీమున్నీసా బేగం సహకారంతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

ముగ్గురు రేషన్ డీలర్లపై కేసులు నమోదు

విస్సన్నపేట: మండలంలో ముగ్గురు రేషన్ డీలర్లపై కేసులు నమోదు చేసినట్లు పీడీఎస్ డీటీ శివనాగరాజు గురువారం తెలిపారు. విస్సన్నపేటలో రెండు దుకాణాల్లో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా 0614002 రేషన్ షాపులో 1600 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు, 0614034 షాపులో 750 కిలోల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. మండలంలోని నర్మదానగరం దుకాణంలో గురువారం తనిఖీలు చేయగా 1,054 కిలోల బియ్యం తక్కువగా ఉందని, దీంతో ముగ్గురు డీలర్లపై కేసు నమోదు చేశామని పీడీఎస్ డీటీ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ వసంత బాబు, ఎస్ఐ నాగేశ్వరరావు, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

కోలాహలంగా క్రికెట్ పోటీలు

గంపలగూడెం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం గంపలగూడెం మండలంలోని 21 సచివాలయాల్లో క్రికెట్ పోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ పోటీల్లో 42 టీములు పాల్గొన్నాయని ఎంఈఓ పి.వి.డి.ఎల్.నరసింహారావు, తిరువూరు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త గుర్రం గోపాలరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన పోటీలను యువకులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

తోలుకోడు(మైలవరం): పేదల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని సర్పంచ్ ఓబులరెడ్డి దుర్గారెడ్డి పేర్కొన్నారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో నూతన పెన్షన్లను వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ ప్రెసిడెంట్ జగదీష్ బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డు శ్రీను, నాయకులు ఎలీషారావు, ఇంకొల్లు చంటి పాల్గొన్నారు.